ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శుక్రవారం | మే 08, 2026 | సంపుటి : 6 | సంచిక : 339 | పేజీలు : 2

## బల్దియా స్పెషల్ ఆఫీసర్‌గా చాహత్ బాజ్ పాయ్



- జీ డబ్ల్యూ ఎంసి ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ
- అభివృద్ధి పనులు సకాలం లో పూర్తి చేయాలని వింగ్ అధికారులకు ఆదేశం

2 లో





## రైతు భవిష్యత్తుకు.. కొత్త దిశ
# మెగా రైతు మేళా

### రైతు సంక్షేమం, ఆదాయ పెరుగుదల దిశగా ప్రభుత్వం అడుగు
### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హన్మకొండ, ఆయుధం:** రైతు భవిష్యత్తుకు కొత్త దిశ - మెగా రైతు మేళా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా చివరి రోజు గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య అతిథులుగా హాజరై వివిధ స్టాళ్లను సందర్శించారు. వారి వెంట వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా ఆఅధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రైతు ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.తెలంగాణ వ్యవసాయానికి కొత్త దిశ చూపిన రైతు మేళా అని అన్నారు. మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా యాంత్రీకరణ, పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్లు, అధికారులు సమన్వయంతో ఈ మేళాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు పంటల సాగులో మెలకువలు తెలుసుకుని అధిక దిగుబడి సాధించాలని సూచించారు. మహిళా రైతులు లావణ్య రెడ్డి, భావన రెడ్డి వంటి ఆదర్శ రైతుల వ్యవసాయ విధానాల నుంచి స్ఫూర్తి పొందాలని తెలిపారు. భూసారం క్షీణిస్తే ఎంత మందులు వాడినా ప్రయోజనం ఉండదని, భూమిని కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగంతో ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, పూర్వికుల సహజ వ్యవసాయ పద్ధతులను తిరిగి ఆచరించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రం వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండున్నర సంవత్సరాల్లోనే 25 లక్షల మంది రైతులకు సుమారు 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఒకే రోజు రైతుబంధు నిధుల విడుదల, యూరియా సరఫరా వంటి చర్యలు రైతు సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. దేశంలోనే మిగతా2లో..

# బీజేపీ, బీఆర్ఎస్ గలాటా

### పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి యత్నించిన బీజేపీ కార్యకర్తలు

- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల క్యాంప్ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత
- హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్ వైపు దూసుకెళ్లిన బీజేపీ శ్రేణులు





**కరీంనగర్, ఆయుధం:** బండి సంజయ్‌పై పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కరీంనగర్‌లో ఉద్రిక్తతకు దారితీశాయి. డ్రగ్స్ అంశంలో బండి సంజయ్‌ను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టిన కౌశిక్‌రెడ్డిపై దాడికి యత్నించాయి. ఆయన కారుతో పాటు కార్యాలయంలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాయి. బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిదాడులకు సిద్ధమవగా పోలీసులు ఇరువర్గాల్ని చెదరగొట్టారు. కౌశిక్‌రెడ్డి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

#### గన్‌కల్చర్ పెరిగిపోతోంది :

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టిన హుజురాబాద్ శాసనసభ్యులు కౌశిక్‌రెడ్డి బండి సంజయ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య రాజకీయంగా మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్ వ్యాప్తంగా గన్‌కల్చర్ పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. శాంతిభద్రతలు లోపించినా స్థానిక ఎంపీగా బాధ్యత వహించాల్సిన బండి సంజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవటం శోచనీయమని మండిపడ్డారు. వేలాది కోట్ల రూపాయల అవినీతి సొమ్ముతోనే ఇటీవల కరీంనగర్ మున్సిపల్ పీఠాన్ని బండిసంజయ్ గెలిచారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

#### తంబాకులో డ్రగ్స్

సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించకుండా బండి సంజయ్ ఇష్టారీతిన కేటీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని అంటున్న బండి సంజయ్‌పై తామూ అభాండాలు వేయవచ్చు కదా? అన్నారు. తంబాకులో డ్రగ్స్ కలుపుకుని సంజయ్ తింటారని అంటామన్న కౌశిక్‌రెడ్డి డ్రగ్స్ వల్లే బండి సంజయ్ తలపై వెంట్రుకలు పోయాయని అన్నారు. డ్రగ్స్ అంశంలో కేటీఆర్ టెస్ట్‌కు సిద్ధమన్న కౌశిక్‌రెడ్డి బండి సంజయ్ కూడా సిద్ధమా? అని సవాల్ విసిరారు.



#### ఫర్నీచర్ ధ్వంసం

బండి సంజయ్‌పై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలతో క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత తలెత్తింది. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి యత్నించారు. కౌశిక్ కారును ధ్వంసం చేసిన బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే గంగుల క్యాంపు ఆఫీసులోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.

#### రౌడీషీటర్లతో దాడి చేయించారు :

దాడి తర్వాత మళ్లీ మీడియాతో మాట్లాడిన హుజురాబాద్ కౌశిక్‌రెడ్డి తాను చేసిన తప్పేంటని ప్రశ్నించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై తాను కౌంటర్ ఇచ్చానే తప్పా ఎవర్నీ వ్యక్తిగతంగా విమర్శించలేదని అన్నారు. తనపై రౌడీషీటర్లతో దాడి చేయించారని ఆరోపించారు. తనపై దాడి చేసిన అందరిపై హత్యాయత్నం కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

#### కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గంగుల క్యాంపు కార్యాలయంలో ఉద్రిక్తతలతో భారీగా రంగంలోకి దిగిన పోలీసులు బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు. పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. గంగుల క్యాంపు ఆఫీసులో కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు హుజురాబాద్‌కు తరలించారు. మరోవైపు హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కౌశిక్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్ వైపు బీజేపీ శ్రేణులు దూసుకెళ్లాయి. బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.



## ఖానాపూర్ ఎస్సైకి పురస్కారం

**వరంగల్, ఆయుధం:** మూగ జీవాల అక్రమ పాల్పడుతున్న ముఠాకు చెందిన నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఖానాపూర్ ఎస్.ఐ జి.రామ్మోహన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందిస్తూ గురువారం సీపీ కార్యాలయంలో ఎస్. ఐ రాంమోహన్ కు నగదు రివార్డ్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, ఆయుధం:** బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ సీపీ గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ ఉదయం చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు పోలీస్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు.చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పోగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహారించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీం శర్మ, సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ నవీన్ కుమార్ వున్నారు.





చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీపీ

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం సిర్పూర్ లోని బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పోలీస్ కమిషనర్ కు తీర్థ ప్రసాదాలు స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను, ప్రాముఖ్యత, ఆలయంలో జరిగే కార్యక్రమాల వివరాలను ఆలయ పూజారి పోలీస్ కమిషనర్ కు వివరించారు

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి
# దుర్మార్గమైన చర్య: కేటీఆర్



**హైదరాబాద్, ఆయుధం:** ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల దాడి హేయమైనదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. దాడి జరిగిన వెంటనే కౌశిక్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్టు 'ఎక్స్'లో పేర్కొన్నారు. పట్టపగలు గూండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలు, ఆఫీసు ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కళ్ల ముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని ఆక్షేపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీ టీమ్‌గా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఇలాంటి చర్యలకు ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతో శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు.

#### రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా? లేనట్లా?: హరీశ్‌రావు

బీజేపీ శ్రేణుల దాడిని మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా? లేనట్లా? అని ప్రశ్నించారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అత్యంత దురదృష్టకరమని ఆక్షేపించారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.





2 లో

## తిట్ల పురాణానికి ఆద్యుడు రేవంత్ రెడ్డి

- ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు ఉలిక్కి పడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ఆరూరి రమేష్

# ఈనెల 20లోగా డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో విడుదల చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం





**నల్లగొండ, ఆయుధం:** ఈనెల 20వ తేదీలోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మంత్రి సూచించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సేకరించి వినియోగించని భూముల్లో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.

లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు దానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు, నిజమైన భూ యాజమానులకు చట్టపరంగా హక్కులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశమయ్యారు.

#### అక్రమాలకు తావులేకుండా :

ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎక్కువ అధికారాలను కలెక్టర్లకే ఇచ్చినట్లు మంత్రి వివరించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లులను సకాలంలో విడుదలయ్యేలా చూడాలని కలెక్టర్లకు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా అర్హులకే ఫలాలు దక్కేలా చూడాలని ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్న భూవివాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమని అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో కొత్త రిజిస్ట్రేషన్ ఆఫీసు, నల్గొండ అర్బన్, రూరల్ ఎమ్మార్వో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరగా మంత్రి పొంగులేటి దానికి అంగీకరించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు
# గుడ్ న్యూస్

- వడ్డీలేని రుణాలు రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంపు



**హైదరాబాద్, ఆయుధం:** మహిళా స్వయం సహాయక బృందాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మహిళా సంఘాలకు ఇస్తున్న వడ్డీలేని రుణాలను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతున్నట్టు మంత్రి సీతక్క తెలిపారు. స్వయం సహాయక బృందాలు తీసుకునే రూ. 10లక్షల బ్యాంకు రుణాలపై వడ్డీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను ఇవాళ ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిగతా2లో..



## ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

◆ **తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి**

**ములుగు, ఆయుధం:** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ... ఈ నెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని, 10వ తేదీలోగా ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్ లు, గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఇండ్ల గణన శిక్షణకు బ్యాచ్స్ హాజరు, సి ఎం ఎం ఎస్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్ జీ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందని, స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వీయ గణనపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి పి ఓ ప్రకాష్, ఎస్ ఓ లాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మక్కల కొనుగోలులో ప్రభుత్వం విఫలం

◆ **సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య**

**వరంగల్, ఆయుధం:** రాష్ట్ర ప్రభుత్వం పండించిన ప్రతి గింజ కొంటామని చెప్పినప్పటికీ మొక్కజొన్నల కొనుగోలులో పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య విమర్శించారు. సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్లోని ఎనుమాముల మార్కెట్ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారు చెప్పిన ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతులను ఉద్దేశించి నాగయ్య మాట్లాడుతూ మొక్కజొన్నలు అమ్ముకోవడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్న ఆచరణ గడప దాటలేదు అని విమర్శించారు. రైతుల కొనుగోలు కేంద్రాల్లో వారాల కొద్ది పడిగాపులు పడుతున్నారని మొదటి తూకం పెట్టిన రైతులకు కూడా నేటికీ డబ్బులు రాలేదని ఇది చాలా దారుణం అని అన్నారు. కొనుగోలు వెంటనే చేసి రైతులను ఆదుకోవాలని ప్రతి 2000 ఎకరాలకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తూకం వేసిన వారం రోజుల్లో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఈ నెల 11న ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నాలకు సిపిఎం పార్టీ పిలుపునిచ్చిందని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, జిల్లా నాయకులు ఈసంపల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, మున్నాల సాయిలు, బోళ్ల సాంబయ్య, ఆరూరి కుమార్, రత్నమాల, బషీర్, దుర్గయ్య, ఏరా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్తు నిర్వహణలో మాక్ డ్రిల్స్ స్పందన కీలకం

◆ **డి. హరిచందన ఐఏఎస్, కార్యదర్శి, రెవెన్యూ డి.ఎం.**

**ములుగు, ఆయుధం:** వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు, అటవీ అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో మాక్ డ్రిల్స్ కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ కార్యదర్శి డి. హరిచందన అన్నారు. మే 15న జరిగే టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌కు సంబంధించి వివిధ శాఖల అధికారులు మరియు జిల్లాల యంత్రాంగంతో గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు.మే 18న వివిధ జిల్లాల్లో రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లు జరగనున్నాయి తెలిపారు.

2025లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల నుండి త్వరిత స్పందన మరియు సమన్వయ సేవలను నిర్ధారించడంలో ఎంతో ఉపయోగపడ్డాయని కార్యదర్శి అన్నారు.

ఇటువంటి వ్యాయామాలు క్షేత్ర స్థాయిలో లోపాలను గుర్తించడంలో సహాయపడతాయని మరియు శాఖలు క్రమబద్ధమైన పద్ధతిలో ప్రణాళిక మరియు సంసిద్ధతను మెరుగుపరచుకోవడానికి అవకాశం కల్పిస్తాయని ఆమె అన్నారు.

తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ మే 18న జరిగే వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌లలో దాదాపు 60 శాఖలు మరియు కేంద్ర ఏజెన్సీలు పాల్గొంటాయని చెప్పారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో తెలంగాణ 2025 డిసెంబర్‌లో వరదలు మరియు పారిశ్రామిక ప్రమాదాలపై మొదటిసారి మాక్ డ్రిల్స్ నిర్వహించిందని, ఇది అంతర్‌శాఖ సంసిద్ధతను మరియు విపత్తులకు త్వరిత స్పందనను గణనీయంగా బలోపేతం చేసిందని ఆయన అన్నారు.

2026 సంవత్సరానికి వరదల సంబంధిత మాక్ డ్రిల్స్ 13 జిల్లాల్లో, పారిశ్రామిక ప్రమాద డ్రిల్స్ ఐదు జిల్లాల్లో మరియు అటవీ అగ్ని మాక్ డ్రిల్స్ నాలుగు జిల్లాల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్సర్‌సైజ్‌ల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అన్ని శాఖలను ఆయన ఆదేశించారు.

న్యూఢిల్లీ నుండి వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బెహ్ల్ (రిటైర్డ్), వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని పరిస్థితుల సమయంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల పాత్రలు మరియు బాధ్యతలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. 15వ తేదీన టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ మరియు 18న జరిగే రాష్ట్ర స్థాయి మాక్ డ్రిల్స్ ఏర్పాట్లకు సంబంధించి ఆయన అనేక సూచనలు కూడా చేశారు.

ఈ ప్రజెంటేషన్‌లో అంతర్‌శాఖ సమన్వయం, ప్రణాళిక, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్ మార్గదర్శకాలు, సహాయ శిబిరాల ఏర్పాటు, ఆసుపత్రి సంసిద్ధత, అటవీ అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యల గూర్చి వివరించారు. ఈ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశపు గది నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, డి.ఎం.హెచ్.ఓ డా. గోపాలరావు, డి.పి.ఓ వెంకయ్య, డి.ఈ.ఓ సిద్ధార్థ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్.డి.ఆర్.ఎఫ్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# తిట్ల పురాణానికి ఆద్యుడు రేవంత్ రెడ్డి

◆ **ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు ఉలిక్కి పడుతున్నారు**

◆ **మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ఆరూరి రమేష్**



**హనుమకొండ, ఆయుధం:** తిట్ల పురాణానికి ఆధ్యుడు సీఎం రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి తాటికొండ రాజయ్య విమర్శలు గుప్పించారు. హనుమకొండ లోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కన్స్ట్రక్షన్ లేదు కేవలం డిస్ట్రక్షన్ మాత్రమే ఉందన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి 60 సార్లు పోయి ఒక్క రూపాయి అయినా తెచ్చారా అని ప్రశ్నించారు. రైతు బంధు లాంటి పథకం దేశంలో ఎక్కడా లేదు. దేశంలో వ్యవసాయాన్ని పండగలా మార్చింది కేసీఆర్ అన్నారు. ప్రాజెక్టులు, వ్యవసాయం మీద ఏ ఒక్క సమీక్ష లేదన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే హక్కు మాకు ఉందన్నారు. మానవీయ కోణంలో ఈ ప్రభుత్వం పని చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాలు కాకుండా కూల్చివేతలు చేస్తోందన్నారు. క్యాబినేట్ మంత్రులు అందరు కలిసి వచ్చి దేవాదుల పంపు హౌజ్ ను ప్రారంభించలేక పోయారన్నారు.తెలంగాణను తిరోగమనంలోకి కాంగ్రెస్ తీసుకెళ్తాందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అన్నీ డిక్లరేషన్లపై మాట్లాడుతాము పోరాడుతాం ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ దందా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఉలిక్కిపడుతున్నారన్నారు. మంత్రి పదవుల కోసం ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలెప్పుడు అని అడిగితే.. ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. పాలన తెలియదా, మేము ఏమైనా హౌలగాళ్ళమా అని నాడు రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. మీకు అసలు వ్యవసాయం గురించి తెలుసా, రైతు జీవితాలకు భరోసా ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వంది అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కల్లాల దగ్గర పంటలను కొంటున్నాము అంటున్నారు. కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందిపడుతున్న మాట వాస్తవం కాదా అన్నారు. ఇంకా పోలీసు అనుకుంటున్నావా అని ఎద్దేవా చేశారు. మా నాయకుడికి థర్డ్ డిగ్రీ ఇస్తా అంటావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటల మీద పెట్టిన శ్రద్ధ చేతల మీద చూపండన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి ఎందుకు ప్రతిపక్షం ఊ అంటే వెంటనే ఉలిక్కిపడుతున్నాడన్నారు. తెలంగాణ కోసం జైలుకు పోయిన నాయకుడు కేసీఆర్, కేటీఆర్ అన్నారు. మంత్రిగా కేటీఆర్ తన శాఖల ద్వారా ఎంత అభివృద్ధి చేశారో తెలియని అజ్ఞానులు మీరు అని ప్రశ్నించారు. మామునూరు ఏర్పాటు, నయీమ్ నగర్ నాలా బ్రిడ్జి నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకు కోసం పోరాడి, సాధించింది బీఆర్ఎస్సే అన్నారు. తెలంగాణ ప్రజల తరపున అన్ని వర్గాల కోసం పోరాడుతున్నాం. ఎన్నిసార్లు రైతు బంధు పూర్తి స్థాయిలో ఇచ్చారని అన్నారు. పెద్ద సభ పెట్టి ఎకరానికి రైతుబంధు వేసిందు రేవంత్ రెడ్డి అన్నారు. కానీ కేసీఆర్ రైతులు అడగకుండానే రైతు బంధు ఇచ్చారన్నారు. మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిన్న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రైతు సంగ్రామ సదస్సు విజయవంతం అయ్యిందన్నారు. సదస్సు విజయవంతం కావడంతో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అవాకులు చెవాకులు పేలారన్నారు. రైతు సంగ్రామ సదస్సుకి పోటీ సభలు పెడితే అవి ఫెయిల్ అయ్యాయన్నారు. రైతులకు ఇస్తామని అన్న ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, చింతల యాదగిరి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, నాయకులు తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, రామ్మూర్తి, నార్లగిరి రమేష్, నయీముద్దీన్, పానుగంటి శ్రీధర్, బండి రజినీకుమార్, రవీందర్ రావు, గంద్రకోట రాకేష్ యాదవ్, శ్రీకాంత్ చారి, మూటిక రాజు, కోటేశ్వర్ రావు, పులి విక్రమ్, వీపీ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, స్నేహిత్, పున్నం చందర్, అప్జల్, తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా ప్రత్యేక అధికారిగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

◆ **జీ డబ్ల్యూ ఎంసి ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ**

◆ **అభివృద్ధి పనులు సకాలం లో పూర్తి చేయాలని వింగ్ అధికారులకు ఆదేశం**



**వరంగల్, ఆయుధం:** వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం ఉదయం బల్దియా ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు చేపట్టారు. మే 6వ తేదీతో పాలక వర్గ సభ్యుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హన్మకొండ జిల్లా కలెక్టర్ జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వివిధ విభాగాల ఉన్నతాధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశం లో కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి పలు ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరితంగా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. పనుల అమలులో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట వెంటనే స్పందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టెండర్లు, ప్రాజెక్టు ప్రతిపాదనలు, మంజూరైన నిధుల వినియోగం వంటి అంశాల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన అమలు ఉండాలని సూచించారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టులు త్వరలో ప్రారంభం కానున్నాయని, వాటి ద్వారా నగరానికి మరింత మౌలిక సదుపాయాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా రహదారులు, పారిశుధ్యం మౌలిక వసతుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం లో ప్రజా ఫిర్యాదులకు తక్షణం స్పందించి పరిష్కరించాలని, ఫైళ్లు ఎక్కడా నిలిచిపోకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో సమన్వయంతో పనిచేస్తేనే నగర అభివృద్ధి వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డ కలెక్టర్, సిఎన్ డి ప్రాజెక్ట్ ను ఏజెన్సీ నిర్వాహకులతో సంప్రదించి వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అందుకు కావలసిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. యుజీడి ప్రాజెక్ట్ డిపిఆర్ అంతిమ దశకు చేరుకున్నందున ఇంజనీరింగ్ అధికారులు అందుకు అవసరమైన సూచనలు చేయాలని అన్నారు. బాల సముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ నిర్వహణ తీరును అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్వహణ తీరును పరిశీలించి సమర్థవంతం గా కొనసాగేలా చూడాలని అన్నారు. బయో సిఎన్ జీ ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వాలని,వడ్డేపల్లి బండ్ పై అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు వేగం గా పూర్తి చేసేలా చూడాలని అన్నారు.

టాక్స్ కలెక్షన్ నిర్వహణ వ్యవస్థలను క్రమబద్ధీకరించాలని, సుమారు రూ.100 కోట్ల విలువైన పెద్ద ప్రాజెక్టులు వేగంగా అమలు అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డా.రాజేష్, ఈఈలు రవి కుమార్, సంతోష్ బాబు, మహేందర్, మాధవి లత, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి..)

స్పెషల్ సీఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవ రాజన్, బ్యాంకర్లు, స్త్రీ నిధి డిప్యూటీ ఎండీ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాల రుణాల వడ్డీల కోసం రూ.2,500 కోట్లు వ్యయం చేస్తామని వెల్లడించారు. మహిళా ఉన్నతితెలంగాణ ప్రగతి అన్న నినాదంతో ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. మహిళలు పేదరికం నుంచి బయట పడినప్పుడే అభివృద్ధి పరిపూర్ణం అవుతుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందని ఆమె స్పష్టం చేశారు.

## జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

**ములుగు, ఆయుధం:** శుక్రవారం హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా మెగా జాబ్ మేళాను ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఉత్తీర్ణత సాధించిన ములుగు జిల్లా యువతీ యువకులు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ సెక్టార్, కస్టమర్ కేర్ సర్వీస్, హాస్పిటాలిటీ, తదితర రంగాలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కలవని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యా అర్హత ఇతర ధ్రువీకరణ పత్రాలతో నేరుగా మెగా జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# రైతు భవిష్యత్‌కు కొత్త దిశ మెగా రైతు మేళా

(మొదటి పేజీ తరువాయి..)



మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతులు అప్పుల భారంలో పడకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు. రుణమాఫీలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సిద్ధిపేటలో ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాతావరణ ప్రభావం తక్కువగా ఉండే, అధిక లాభాలు ఇచ్చే ఆయిల్ పామ్ పంటను రైతులు విస్తృతంగా సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ రైతులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే విధంగా స్ఫూర్తిదాయక ప్రసంగాలు విన్నామని తెలిపారు. వివిధ పంటలను సాగు చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులు తమ అనుభవాలను పంచుకోవడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. ప్రస్తుతం ఆహార పదార్థాలు, పానీయాలలో కల్తీ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సహజ, సేంద్రియ వ్యవసాయానికి మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. ప్రజా పాలనలో రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగు చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయాలని కోరారు. ఆయిల్ పామ్ పంట లాభసాటిగా ఉన్నందున రైతులు దీని సాగును విస్తృతంగా చేపట్టాలని మంత్రి సూచించారు.

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు చెందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తున్నదని తెలిపారు. ప్రాంతాలవారీగా జరుగుతున్న మార్పులను గమనించి పంటల మార్పిడి ద్వారా వ్యవసాయాన్ని సాగు చేయాలని రైతులకు సూచించారు. దేశంలో ఎక్కడలేని విధంగా రైతు సంబంధాలు మన రాష్ట్రంలో బలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రైతులకు సూచిస్తూ, రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మరింత చేరువగా కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పంటల మార్పిడి ద్వారా రైతులకు లాభాలు పెరుగుతాయని, రైతు మేళాల ద్వారా అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. రెండున్నర ఏళ్లలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయని, రైతు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా, పంట కొనుగోళ్లు, రుణమాఫీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతు సంక్షేమ పథకాలు, విద్యుత్ సరఫరా, సన్న బియ్యానికి బోనస్ వంటి కార్యక్రమాలు రైతులకు ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మాట్లాడుతూ రుణమాఫీ, పంట విస్తీర్ణం పెరుగుదల, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై వివరించారు. ఆలేరు రైతు గోపిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు. మహిళా రైతు లావణ్య రెడ్డి ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగు ద్వారా లాభాలు సాధిస్తున్నామని తెలిపారు. మహిళా రైతు భాగ్యలక్ష్మి మిర్చి పంట సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాల గురించి వివరించారు. పామాయిల్ పంట సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తూ లాభాలు అర్జిస్తున్న పలువురు రైతులకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కొండా సురేఖ ఎంపీ ఎమ్మెల్యేల చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.









Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695